ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 16 ఏప్రిల్ 2024





సీఎం జగన్ బస్సుయాత్ర జనానికి నరకయాతన చూపిస్తోంది. అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం, వాహనాల రాకపోకలను నిలిపివేయడం, దారిపొడవునా కరెంటు కట్ చేయడం లాంటి విన్యాసాలతో జనానికి చుక్కలు చూపిస్తున్నారు. కృష్ణా జిల్లాలో సోమవారం జాతీయ రహదారిపై ట్రాఫిక్ దిగ్బంధనాల మధ్య జగన్ రోడ్డు 'షో' జరిగింది. జాతీయ రహదారిపై రెండో వైపున ట్రాఫిక్ వెళ్లటానికి అవకాశమున్నా.. వాహనాలను ముందుకు సాగనీయకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు బారులుతీరాయి. ఆగిపోయిన ట్రాఫిక్ వాహనాలు, తరలించిన జనాల కలయికతో.. రోడ్డు 'షో'ను రక్తికట్టించాలని చూశారు. ఎన్‌హెచ్-16పై కేసరపల్లి నుంచి ఎన్‌హెచ్-216పై గుడివాడ వరకు ట్రాఫిక్ ఆపేసి బస్సు యాత్రను కొనసాగించారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ కష్టాలు ఏర్పడ్డాయి.

గన్నవరం నుంచి హనుమాన్‌జంక్షన్ రోడ్డులో భారీగా నిలిచిన ట్రాఫిక్

ఆపషోపాలు!

జగన్ రోడ్డు షోతో జనానికి షాక్

దారి పొడవునా ట్రాఫిక్ నిలిపివేత

- రోడ్డుకు ఒకవైపు బస్సుయాత్ర అయితే.. రెండోవైపు వాహనాలకు ఆటంకాలు
- బస్సుయాత్రకు హైప్ తెచ్చేందుకే ఈ తంతులు
- ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 216 హైవేలపై యాత్ర పొడవునా ఇదే షో
- మూడు గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు, ప్రయాణికులు
- అడ్డొస్తున్నాయన్న పేరుతో సర్వీసు వైర్లు కత్తిరింపు
- జగన్ యాత్ర వెళ్లే గ్రామాల్లో కరెంట్ కోతలు



గన్నవరంలో రాకపోకలను ఆపేసిన పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం/ఉంగుటూరు/హనుమాన్‌జంక్షన్/జంక్షన్ రూరల్) : దేశంలోనే అత్యంత రద్దీ కలిగిన జాతీయ రహదారుల్లో ఒకటైన ఎన్‌హెచ్ - 16 అనేది కోల్‌కతా - చెన్నయ్ ప్రధాన రోడ్డు మార్గం. ఈ మార్గంలో జగన్ బస్సుయాత్ర పేరుతో రోడ్డు షో సాగటం అంటే ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడటమే. బస్సుయాత్ర ఒకవైపు సాగుతుంటే.. రెండో వైపున ట్రాఫిక్‌ను నిలిపివేశారు. బస్సుయాత్రకు హైప్ తీసుకురావటం కోసమే ఈ రకంగా ట్రాఫిక్ ఆపేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ ఆగిపోవటంతో ఆగిపోయిన బస్సులు, లారీలపై జెండాలు పట్టుకున్న కార్యకర్తలను ఎక్కించి హడావిడి చేయించారు. బస్సుయాత్ర పొడవునా ఈ కార్యక్రమమే నడిచింది. దీంతో ఇదేదో భారీస్థాయిలో జరుగుతున్నట్టుగా బిల్డప్ ఇచ్చినట్టు అయింది. ముఖ్యమంత్రి జగన్ పది గంటలకు కేసరపల్లిలోని బస ప్రదేశం నుంచి బయటకు వస్తారన్నది షెడ్యూల్ అయితే, 9 గంటల నుంచే పోలీసులు రామవర ప్పాడు నుంచి బ్లాక్ చేస్తూ వచ్చారు. జగన్ బయటకు వచ్చే సమయంలో ఎడమవైపున ఒక్కసారిగా వదిలేశారు. కాన్వాయ్ బయటకు వచ్చేటపుడు మళ్లీ ట్రాఫిక్ ఆపేశారు. ముందు వెళ్లిన వాహనాలన్నీ గన్నవరంలో చిక్కుకుపో యాయి. గన్నవరంలో వైసీపీ కార్యకర్తలు రోడ్డుపై ఉండటంతో.. వాహనాలు ముందుకు సాగలేదు. ఒకర కమైన వాతావరణాన్ని సృష్టించారు. దాదాపుగా గంటపాటు ఈ హడావిడి కనిపించింది. ఈలోపు విజయవాడ నుంచి తరలించిన జనాలు రావటంతో.. అప్పటికి కానీ ట్రాఫిక్‌ను వదల్లేదు. జగన్ వెళ్లే లేనులో కూడా అంచెలంచెలుగా ట్రాఫిక్ ఆపుతూ, పంపిస్తూ మేనేజ్‌మెంట్ చేశారు. రెండోవైపు అయితే పూర్తిగా ఆపేశారు. రెండో వైపున వాహనాలు బ్లాక్ కావటంతో బస్సులు, కార్లలో ఉన్న ప్రయాణికులు దిగి పోలీసులతో వాగ్వివాదాలకు దిగారు. దీంతో పోలీసులు నిదానంగా వెళ్లటానికి అవకాశం కల్పించారు.

● ట్రాఫిక్ సమస్యతో రోడ్డు ప్రమాదం

జాతీయ రహదారికి రెండోవైపున కార్యకర్తలను నిలువరించకపోవటం వల్ల ప్రమాదం కూడా జరిగింది. గన్నవరం గాంధీచౌక్‌లో వీనస్ సెంటర్ ఎదురుగా బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు టైరు కింద ద్విచక్రవాహనం పడిపోయింది. అదృష్టవశాత్తూ బైక్‌ను నడుపుతున్న వ్యక్తి ప్రాణాల నుంచి బయటపడ్డాడు. చిన్న అవుటపల్లి నుంచి బస్సుయాత్రను సర్వీసు రోడ్డుకు తీసుకున్నా.. హైవేపై వెళ్లే వాహనాలకు అడుగడుగునా అవాంతరాలు కల్పించారు.

● కరెంట్ కట్.. గ్రామాలు విలవిల

జగన్ బస్సుయాత్ర మొదలైన దగ్గర్నుంచి ఆయన రూట్ వెంబడి విద్యుత్‌ను నిలిపివేశారు. బస్సుయాత్ర సాగినంత వరకు కూడా ఆయా గ్రామాల్లో విద్యుత్‌ను నిలుపుదల చేశారు. అసలే ఎండాకాలం కావటంతో గ్రామాల్లోని ప్రజలు విద్యుత్ కోతలతో అలమటించారు. ఇంట్లో ఉన్నా విద్యుత్ లేకపోవటం వల్ల ఫ్యాన్లు, కూలర్లు పనిచేయక వేడి తాపాన్ని అనుభవించలేక నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో విద్యుత్ సర్వీసు వైర్లు అడ్డుగా ఉన్నాయని.. విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ వైర్లను కట్ చేశారు. ఈ కారణంగా సాయంత్రం వరకు కూడా కొందరికి కరెంట్ కష్టాలు ఏర్పడ్డాయి. బస్సు యాత్ర వెళ్లిపోయిన తర్వాత లైన్‌మెన్‌ను పిలిపించుకుని సర్వీసు వైర్లను బాగు చేయించుకోవాల్సి వచ్చింది.

విమానాశ్రయ నిర్వాసితులను కలవటానికి ముఖం చాటేసిన సీఎం

విమానాశ్రయ నిర్వాసితులతో భేటీ ఏర్పాటు చేసినా.. వారిని సీఎం కలవలేదు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి కోసం ఇళ్లను కోల్పోయిన వారికి ఐదేళ్లు అయినా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి ఇస్తామన్న డబ్బులు ఇవ్వలేదు. అద్దె డబ్బులు చెల్లించలేదు. వీటికి సంబంధించి రెండుసార్లు ఉత్తుత్తి జీఓలు ఇచ్చి సరిపెట్టారు. జీఓలను అమలు చేస్తే సమస్య పరిష్కారమౌతుంది. జీఓను అమలు చేయకుండా.. నిర్వాసితులను మభ్యపెట్టడానికి వారితో సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం రావటంతో వారితో చర్చించేందుకు ముఖ్యమంత్రి ఆసక్తి చూపించలేదు. నిర్వాసితులను పిలిచినా.. వారితో మాట్లాడలేదు. షెడ్యూల్ లేటు అయిందన్న కారణంతో భేటీ వీలుపడలేదని, వారి దగ్గర నుంచి వినతిపత్రాలను తీసుకుని సరిపెట్టారు.

బస్సుల్లేక.. విలవిల

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి గుడివాడ సిద్ధం సభకు 390 బస్సులు

జనాన్ని తరలించటానికి వందల సంఖ్యలో కిరాయికి ఆటోలు

బస్సులతో పాటు ఆటోలు తగినన్ని లేక ప్రయాణికుల ఇక్కట్లు

విజయవాడకు వచ్చే ఉద్యోగులు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ముఖ్యమంత్రి జగన్ సేవలో ఆర్టీసీ బస్సులు తరించటంతో.. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు బస్సులు లేక విలవిల్లాడారు. అత్యవసర పనుల మీద బయటకు రావటం దుర్భరంగా మారింది. ఉద్యోగులు, చిరువ్యాపారులు, ఉపాధి కూలీలు, వసల కూలీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇలా తమ సొంత ప్రాంతాల నుంచి విజయవాడ రావటం దుర్భరంగా మారింది. ఒక పక్క బస్సుయాత్ర పేరుతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆపివేయటంతో.. వాహనాలు గంటల కొద్దీ ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు బస్సులూ లేవు. కాస్త ముందే బయటకు వచ్చి పనులు ముగించుకుని వెళదామనుకునేవారు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి విజయవాడ బస్‌స్టేషన్‌కు, రైల్వేస్టేషన్‌కు వచ్చిన వారంతా సిటీలోకి ప్రవేశించటానికి బస్సులు లేక నానా ఇబ్బందులు పడ్డారు.

ఆటోలు కూడా కరువే

ఆటోలలో అయినా వెళదామనుకుంటే.. ఆటోలకు కూడా కొరత ఏర్పడింది. వందలాది ఆటోలను కూడా వైసీపీ నేతలు అద్దెకు తీసుకున్నారు. ఆటోలలో జనాలను తరలించటం కోసం భారీ సంఖ్యలో వాటిని అద్దెకు తీసుకోవటం వల్ల ఆటోలకు కూడా కొరత ఏర్పడింది. ఆసియాలో రెండో అతిపెద్దదైన పీఎన్‌బీఎస్‌కు రోజుకు 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన విజయవాడ రైల్వేస్టేషన్‌కు సగటున 3 లక్షల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దాదాపుగా ఐదు లక్షల మంది వరకు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చవేయటానికి అవసరమైన బస్సులు, ఆటోలు లేకపోవటంతో ప్రయాణికులు నానాఅవస్థలు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి మొత్తం 240 బస్సులను గుడివాడ సిద్ధం సభలకు పంపారు. ఇవన్నీ కూడా విజయవాడ నగర పరిధిలోని గవర్నర్‌పేట - 1, గవర్నర్ పేట - 2, విద్యాధరపురం, ఇబ్రహీంపట్నం డిపోల పరిధిలో నడిచే సిటీ బస్సులే కావటం గమనార్హం. దాదాపుగా 80 శాతంపైగా సిటీ బస్సులు జగన్ సభలకు అద్దెకు ఇచ్చారు. కృష్ణాజిల్లాలో కూడా 150 బస్సులను అద్దెకు ఇచ్చారు. ఈ బస్సులు కూడా గన్నవరం, ఉయ్యూరు, గుడివాడ, అవనిగడ్డ, మచిలీపట్నం డిపోలకు చెందిన సిటీ బస్సులనే పంపారు. భారీ సంఖ్యలో సిటీ బస్సులను అద్దెకు ఇవ్వటం వల్ల ఎక్కువగా ప్రయాణించే వారిపై ప్రభావం పడింది.

నేడు కూడా బస్సులకు కొరతే

భీమవరంలో జరిగే సిద్ధం సభకు కూడా ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 390 బస్సులను కేటాయించటం జరిగింది. కాబట్టి మంగళవారం కూడా బస్సులు అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. ప్రయాణికుల కష్టాలు కొనసాగనున్నాయి. మంగళవారం రాకపోకలు సాగించేవారు ప్రత్యామ్నాయాలు చూసుకుంటే ఇబ్బంది పడకుండా ఉంటారు.

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై.. దృష్టి సారించండి - 6లో..

ఊకదంపుడు ఉపన్యాసం

సెల్ఫ్ డబ్బా వేదికగా సిద్ధం సభ

- జిల్లాకు కానీ, గుడివాడకు కానీ హామీలు నిల్
- సీఎం ప్రసంగం మొదలుకాక ముందే జనాలు పరార్
- 5 ఎకరాల్లో సభ ఏర్పాట్లు.. 10వేలలోపు జనం

తుస్సుమన్న రోడ్‌షో.. వచ్చింది బస్సులో... వెళ్లింది కాన్వాయ్‌లో


జనంలేక పలచగా కనిపిస్తున్న సిద్ధం సభ

మేమంతా సిద్ధం అంటూ గుడివాడలో సోమవారం ఏర్పాటు చేసిన సభ మొత్తం ఊకదంపుడు ఉపన్యాసానికే పరిమితమైంది. సీఎం జగన్ సుమారు గంటపాటు మాట్లాడినా ఈ ఐదేళ్లలో జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ఒక్క ముక్క చెప్పలేకపోయారు. కనీసం గుడివాడ నియోజకవర్గానికి ఏం చేశారో.. ఏం చేస్తారో చెప్పకుండా పేలవంగా ఆయన ప్రసంగం సాగింది. కేవలం పథకాలను వల్లె వేయడం.. సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం.. చంద్రబాబు, పవన్‌ను తిట్టడానికే ఈయన ప్రసంగంలో అధికభాగం సరిపోయింది.

గుడివాడ, ఏప్రిల్ 15 : సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి నోరు తెరిస్తే అబద్ధాలు వల్లెవేయడం.. అసందర్భ వ్యాఖ్యలు చేయడంతో జగన్ ప్రసంగం పట్ల వైసీపీ శ్రేణుల్లోనే విముఖత వ్యక్తమయ్యేలా చేసింది. ఎన్నికల వేళ సాధారణంగా జిల్లాలో స్థానిక నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి చెప్పడం ఏ పార్టీ నాయకుడికైనా ఆనవాయితీ. అలాగే తాము అధికారంలోకి వస్తే జిల్లాలో ఫలాన అభివృద్ధి పనులు చేస్తామనో.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామనో కూడా నాయకులు హామీ ఇస్తుంటారు. ఇలాంటివేవీ జగన్ ప్రసంగంలో కానరాలేదు. ఎప్పటిలాగే ఊకదంపుడు ఉపన్యాసంతో బోరు కొట్టించారు. విచిత్ర విన్యాసాలు, వింతైన హావభావాలతో ఆకట్టుకోవాలన్న ఆయన ప్రయత్నం పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు.

సభాప్రాంగణం వెలవెల

మేమంతా సిద్ధం సభ సక్సెస్ కాలేదన్నది వైసీపీ శ్రేణుల నుంచే వస్తున్న మాట. లక్షమందితో ఎన్నడూ జరగని విధంగా సిద్ధం సభను నిర్వహిస్తున్నామని వైసీపీ నాయకులు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో మాత్రం జన సమీకరణలో విఫలమయ్యారు. స్థానిక నాగవరప్పాడులోని ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా 5 ఎకరాల్లో సిద్ధం సభను నిర్వహించారు. అందులో సీఎం వాహనాలు, పోలీసుల వాహనాల పార్కింగ్, వేదిక, జగన్ ర్యాంప్‌వాక్ స్థలం పోను మిగిలిన 3 ఎకరాల్లో ప్రజల కోసం ఏర్పాట్లు చేశారు. ఇరుకుగా ప్రాంగణాన్ని సిద్ధం చేసుకుని లక్షలాది మంది వచ్చినట్లు బిల్డప్ ఇచ్చే ప్రయత్నం చేశారు. మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని గుడివాడ, పామర్రు, పెడన, పెనమలూరు, అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల నుంచి జనాలను తరలించేందుకు ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో జనాలు రాలేదు. పామర్రులో పెట్టిన ఆర్టీసీ బస్సులు నిండక ఖాళీగా ఉండిపోవడం గమనార్హం. 10 వేలలోపు జనాలు మాత్రమే సిద్ధం సభకు హాజరయ్యారని ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం. జగన్ రాకముందు నుంచే సభాప్రాంగణంలోకి రావాలని ప్రజలను, వైసీపీ కార్యకర్తలను నాయకులు వేడుకుంటూనే ఉన్నారు. అయినా ప్రజల నుంచి స్పందన కరువైంది. జగన్ వచ్చి మైకు అందుకునే సమయానికి ప్రాంగణంలో ఉన్న సగం మంది వెనుదిరిగారు. ఇతర ప్రాంతాల నుంచి మధ్యాహ్నం 2 గంటలకే జనాన్ని తీసుకొచ్చారు. ఎండ వేడిమి తట్టుకోలేక వారు నానా అగచాట్లు పడ్డారు. బస్సుల్లో తీసుకొచ్చి వదిలేశారంటూ నాయకులపై పలువురు ఆగ్రహించడం కనిపించింది. సభకు ముందు నిర్వహించిన రోడ్‌షోలో జనాలే కనిపించలేదు. దీంతో సభ ముగిసిన తర్వాత రోడ్‌షోకు స్వస్తి చెప్పి కాన్వాయ్‌లో జగన్ వెళ్లిపోయారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్

బంగారు షాపులో చోరీ

● షట్టర్ బద్దలుకొట్టి రూ.కోటి లూటీ

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 15 : కంచికచర్లలో జ్యూయలరీ షాపు షట్టర్ తాళాలు బద్దలుకొట్టిన దొంగలు సుమారు రూ.కోటి వరకు లూటీ చేశారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు 50 అడుగులు, సీఐ ఆఫీసుకు 100 అడుగుల దూరంలో జరగడం కలకలం రేపుతోంది. కంచికచర్లలో బంగారు షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలవడం వ్యాపారం జోరుగా సాగడంతో దొంగలు పగడ్బందీగా రెక్కి నిర్వహించి చోరీకి పాల్పడినట్టు తెలుస్తోంది. మోటార్ బైక్‌పై వచ్చిన దొంగలు షాపు షట్టర్ తాళాలు పగుల కొట్టి అందులో ఉన్న 350 గ్రాముల బంగారం, 8 కిలోల వెండి, రూ.మూడు లక్షల నగదు దొంగతనం చేశారని షాపు యజమాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. సోమవారం ఉదయం 4.30 గంటలకు బంగారు దుకాణం పక్కన టీ షాపు నడిపే వ్యక్తి బంగారు షాపు తాళాలు పగుల కొట్టి ఉండటాన్ని గమనించి షాపు యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. యజమాని జూలూరు సురేష్‌కుమార్ ఫిర్యాదు నందిగామ ఏసీపీ రవికిరణ్, విజయవాడ క్రైమ్ ఏసీపీ ప్రశాంతిరాయ్, నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు చోరీ జరిగిన తీరును సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

వేణుగోపాలస్వామి భూమి టెండర్లు రద్దు చేయాలి



ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ విజయరాజు సిఫార్సు

వన్‌టౌన్, ఏప్రిల్ 15 : పోరంకిలోని వేణుగోపాల స్వామి ఆలయ నిర్వహణకు చెందిన సర్వే నెంబర్ 420/1లోని 7.75 ఎకరాల భూమి లీజును రద్దు చేయాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు, దేవదాయ కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో శఠగోపం పేరిట పోరంకి వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయ భూముల వేలం విషయంలో గోల్‌మాల్‌పై కథనం ప్రచురితమైంది. ఈ కథనం మేరకు అదే రోజున స్పందించిన దేవదాయ కమిషనర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా డిప్యూటీ కమిషనర్ విజయరాజును నియమించారు. క్షేత్రస్థాయిలో తొలిరోజున దేవస్థాన - మిగతా 6లో

కొత్తూరు తాడేపల్లిలో ఘర్షణ

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక దాడి

- ఐదుగురికి గాయాలు
- ఏడుగురిపై కేసు నమోదు

విజయవాడ రూరల్, ఏప్రిల్ 15 : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఆదివారం రాత్రి ఘర్షణ తలెత్తింది. టీడీపీ నేతల నివాసాల వద్దకు వచ్చి కవ్వింపులకు దిగిన వైసీపీ కార్యకర్తలు ఇనుపరాడ్లు, కర్రలతో టీడీపీ కార్యకర్తలపై దాడికి దిగారు. ఈ దాడిలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం... కొత్తూరు తాడేపల్లిలోని పైలమాలపల్లిలో ఆదివారం రాత్రి వైసీపీ కార్యకర్తలు మద్యం సేవించి గ్రామంలో హల్‌చల్ చేశారు. మోటార్ సైకిళ్లకు సైలెన్సర్లు తీసేసి మాలపల్లిలో చక్కర్లు కొడుతున్న సమయంలో రెండేళ్ల బాలుడికి మోటార్ బైక్ తగిలింది. ఈ విషయమై ఓ వృద్ధురాలు ప్రశ్నించగా వైసీపీ కార్యకర్తలు ఆమెపై దౌర్జన్యానికి దిగారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై ఇనుపరాడ్లు, కర్రలతో వైసీపీ కార్యకర్తలు దాడులు చేశారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్తలు గారపాటి తిరుపతమ్మ, బొడ్డు పండు, కనపర్తి సత్యం, గారపాటి రమేష్‌బాబు, జి.అవినాష్ తీవ్ర గాయాలపాలయ్యారు. దాడి చేసిన వైసీపీ కార్యకర్తలు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలు చప్పిడి రవివర్మ, చప్పిడి శివనాగరాజు, చిగురుపల్లి ఆంజనేయులు, జిల్లా బత్తుల మహేష్, సుఖపోగి శ్యామ్‌కుమార్, చప్పిడి కోటయ్య, చిగురుపల్లి బాబి తదితరులపై కేసు నమోదు చేశారు.




దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు



గన్నవరం సగర సంఘం సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

అండగా ఉంటా.. ఆశీర్వదించండి

» యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 15 : అందరికీ అండగా ఉంటా.. ఆశీర్వదించండి. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ అన్నారు. బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం సగర ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, సగర్లు సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సగర్ల సంక్షేమానికి పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాలను హక్కున చేర్చుకున్నది టీడీపీనేనన్నారు. వైసీపీ పాలనలో దాడులు, విధ్వంసం తప్ప అభివృద్ధి లేదన్నారు. యువకులకు ఉపాధి అవకాశం నియోజకవర్గంలోనే కల్పిస్తామని, తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సగర సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వీర శ్రీనివాసరావు, జిల్లా తాడిశెట్టి వీరాస్వామి, గండికోట సీతయ్య, కర్నాటి నాగార్జునరావు, నక్కా వెంకటేశ్వరరావు, కె.వెంకటయ్య, నక్కా సుబ్బారావు, తాడిపర్తి నాగప్రసాద్, తాడిశెట్టి శ్రీను, నక్కా బుజ్జి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వెంకట్రావును గజమాలతో సత్కరించారు.

అన్ని రంగాలను వైసీపీ దెబ్బ తీసింది : వసంత



చెవుటూరులో మాట్లాడుతున్న వసంత

జి.కొండూరు, ఏప్రిల్ 15 : వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను దెబ్బ తీసిందని బీజేపీ, జనసేన బలపర్చిన మైలరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన చెవుటూరు, వెంకటాపురంలో రచ్చబండ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సోదరుల అభ్యున్నతికి సంబంధించి 27 సంక్షేమ పథకాలను వైసీపీ రద్దు చేసిందన్నారు. విదేశీ విద్యకు ఉన్న అంబేడ్కర్ పేరును మార్చి జగనన్న విదేశీ విద్య అని పెట్టుకోవడమే కాక విద్యార్థులకు సాయం ఆపేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో ఏపీకి పరిశ్రమలు రాలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు సైతం పెంచారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకపోవడంతో ఈప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అమరావతిని సైతం నాశనం చేశారని మండి పడ్డారు. ఐదేళ్ల నరకరానికి సంక్షోభానికి సమస్యలకు ప్రజలు చెక్ పెట్టే సమయం వచ్చిందన్నారు. మహా కూటమి అధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించగల సత్తా చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, పంటాపంచల నరసింహారావు, ఆరే లక్ష్మీకుమార్, యరమల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రుద్రపాకలో ప్రచారం నిర్వహిస్తున్న వెనిగండ్ల రాము, పిన్నమనేని

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి : వెనిగండ్ల

నందివాడ (రుద్రపాక), ఏప్రిల్ 15 : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని గుడివాడ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం మండలంలోని రుద్రపాకలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రాముకు ఘన స్వాగతం లభించింది. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, గ్రామాలలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, అభివృద్ధి శూన్యమన్నారు. ఎన్నికలలో తెలుగుదేశం ప్రభుత్వానికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాలడుగు నానారావు, ధర్మపాల్, సర్పంచ్ జంగం రాజు, మేక రాయుడు, పొట్లూరి శేషగిరిరావు, జాస్తి సాంబశివరావు, పొలిమేట్ల జాన్ అంబేడ్కర్ సూరిబాబు, స్వామి, శివరాజు, వెంకటేశ్వరరావు, పందు విజయ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభకు ఆహ్వానం పలుకుతూ ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న కూటమి నేతలు

బాబు ప్రజాగళం సభకు విస్తృత ఏర్పాట్లు

పెడన, ఏప్రిల్ 15 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 17న పెడన పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించనున్న ప్రజాగళం బహిరంగ సభ ఏర్పాట్లను టీడీపీ కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వేణుగోపాలరావులు సోమవారం పర్యవేక్షించారు. ఈ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌లు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 23 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సభకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రికలు పంచిపెట్టారు. పట్టణంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌ల సభలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకుగాను పోలీసులు 500 మందితో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ సోమవారం సిబ్బందితో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న భవనాలు, చెట్లను పరిశీలించారు. ప్రతి భవనంపైన ముగ్గురు పోలీసులను ఉంచాలని నిర్ణయించారు.

నేడు 4వ తరగతి విద్యార్థులకు

స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 : కృష్ణా జిల్లాలో 142 పాఠశాలల్లో మంగళవారం 4వ తరగతి విద్యార్థులకు స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. సోమవారం కృష్ణవేణి ఐటీఐలో జిల్లాలోని వివిధ మండల విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. జిల్లాలో వివిధ యాజమాన్యాలకు చెందిన 142 పాఠశాలల్లో 3229 మంది 4వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితంలలో 90 నిమిషాల సేపు పరీక్ష నిర్వహిస్తారన్నారు. మూడు సబ్జెక్టుల్లో రెండు సబ్జెక్టుల్లో విద్యార్థులు పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల బోధనాభ్యసన సామర్థ్యాలను బేరీజు వేసేందుకు ఈ పరీక్షలకు 142 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్లు, ఎంఈవోలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ఎంఈవోలు పాల్గొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు తగిన తాగునీరందించాలన్నారు. ఈనెల 23 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ఇస్తున్నారన్నారు. జూన్ 6న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు.

జగన్ బస్సు.. జనం కస్సు బుస్సు!

సీఎం సిద్ధం సభ కోసం..

అధికార పార్టీ నేతల అత్యుత్సాహం

» విద్యుత్ కోతలతో జనం విలవిల

» బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

» పోలీసుల ముందస్తు అరెస్టులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15 : ఒక వైపు నిప్పుల కొలిమిలా ఎండ.. మరోవైపు జగన్ బస్సు యాత్ర కోసం ప్రభుత్వ పెద్దలు, అధికారులు, పోలీసు యంత్రాంగం అత్యుత్సాహం మధ్య జనం అల్లాడుతున్నారు. సీఎం బస్సు యాత్ర ఉందని ఎక్కడికక్కడ విద్యుత్‌ను గంటల తరబడి నిలిపివేయడంతో గ్రామాల్లో ప్రజలు నరకం చూశారు. సీఎం బస్సు యాత్ర సోమవారం పెరికీడు, కానుమోలు, ఆరుగొలను మీదుగా గుడివాడ వెళ్లింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌ను నిలుపుదల చేశారు. అసలే ఎండ వేడితో ప్రజలు అల్లాడుతుంటే సీఎం పర్యటన పేరుతో గంటల తరబడి విద్యుత్ కోతలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఏ.సీతారాంపురం కూడలి వద్ద.. కానరాని జనం..



జగన్ బస్సు యాత్ర సందర్భంగా గన్నవరంలో రోడ్డుపై విద్యుత్ వైర్లు తొలగిస్తున్న సిబ్బంది

గుడివాడ వైపు బస్సుల్లేవు..

జగన్ బస్సు యాత్ర కారణంగా గుడివాడవైపు బస్సులను సోమవారం మధ్యాహ్నం నుంచి నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ వెళ్లి అక్కడ నుంచి గుడివాడ వెళ్లాలంటూ ఆర్టీసీ సిబ్బంది సూచించడం.. రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గన్నవరంలో గరం.. గరం

గన్నవరం : సీఎం జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు జనాన్ని తరలించేందుకు వైసీపీ నేతలు నానా పాట్లు పడుతున్నారు. గన్నవరం నియోజకవర్గంతో పాటు నూజివీడు, విజయవాడ నుంచి ప్రజల్ని తరలించేందుకు రూ.300 నగదు, బైక్‌కు రూ.100 పెట్రోల్, బిర్యానీ పొట్లాలు, క్వార్టర్ మందు ఆఫర్లు ఇచ్చారు. వృద్ధులు, ఓట్లు లేని వారిని కూడా యాత్రకు తీసుకొచ్చారు. మండుటెండలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గన్నవరంలో షాపులను మూయించారు. బస్సు యాత్ర వెళ్లే వరకు విద్యుత్ నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ వెళ్లే బస్సు కింద యువకుడు ద్విచక్ర వాహనంతో పడిపోగా డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. పలుచోట్ల వైసీపీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. భవనాలపై ఎవరూ ఎక్కకుండా పోలీసులు ప్రజలను అడ్డుకున్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

అవనిగడ్డ : సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభను పురస్కరించుకుని ఆర్టీసీ సర్వీసులను రద్దు చేసి బస్సులను గుడివాడకు తరలించటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తెల్లవారుజామున 2.30 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే బస్సును రద్దు చేయటంతో ప్రయాణీకులు బస్టాండ్ వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు అన్ని రోడ్లలోని బస్సులను రద్దు చేయటంతో నాగాయలంక, కోడూరు మండలాల నుంచి తీర ప్రాంత మత్స్యకార గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మత్స్యకార గ్రామాల ప్రజలు కేవలం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలన్న కట్టుబాటును ఖచ్చితంగా పాటిస్తుంటారు. అలాంటి గ్రామాలకు వెళ్లే సర్వీసులను రద్దు చేసి సీఎం జగన్ సభకు తరలించటంతో తమ గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని, గడిచిన రెండు నెలల కాలంగా సిద్ధం సభల కోసం తమ గ్రామాలకు వచ్చే బస్సులను రద్దు చేసి సభకు తరలించారని, ఎక్కువ సర్వీసులు ఉండే సర్వీసులను రద్దు చేస్తే ప్రత్యామ్నాయ అవకాశాలు ఉంటాయని, గ్రామాలకు సర్వీసులను రద్దు చేయటం దారుణమని తీర ప్రాంత గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



ఉయ్యూరు బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

ఉయ్యూరు : ఉయ్యూరు ఆర్టీసీ డిపోతో పాటు ఇతర డిపోల బస్సులన్నీ సోమవారం గుడివాడ జగన్మోహన్‌రెడ్డి సభకు తరలి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉయ్యూరు డిపోలో 50 బస్సులకుగాను 7 బస్సులు మరమ్మతులకు గ్యారేజిలో ఉండగా 42 బస్సులు గుడివాడకు వెళ్లగా ఒక బస్సు మాత్రం డిపోలో ఉంచారు. స్థానిక డిపో బస్సులే కాక ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులు కూడా లేకపోవడంతో బస్టాండ్, బస్టాపులో ప్రయాణికులు పడిగాపులు కాచారు. ఎంతసేపు వేచి చూసినా బస్సులు రాకపోవడంతో అధిక చార్జీ చెల్లించి ఆటోలను ఆశ్రయించారు. మంగళవారం కూడా బస్సులు భీమవరంలో జరిగే జగన్మోహన్ రెడ్డి సభకు కేటాయించినట్లు డిపో అధికారులు తెలిపారు.



కంకిపాడులో ఉదయం 8 గంటలకే జన సమీకరణకు ఏర్పాటు చేసిన బస్సులు

ఉదయం 8 గంటలకే ఆర్టీసీ బస్సులు..

కంకిపాడు : అధికార పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఉదయం 8 గంటలకే సుమారు 40 ఆర్టీసీ బస్సులు కంకిపాడు పోలీసు స్టేషన్ సెంటర్‌కు చేరకున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సోమవారం గుడివాడలో సాయంత్రం 6 గంటల సమయంలో నేను సిద్ధం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ఈ బహిరంగ సభకు మండలంలోకి వివిధ గ్రామాల నుంచి సుమారు 40 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే ఆర్టీసీ బస్సులు కంకిపాడులోని పోలీసు స్టేషన్ అంటే రైతు బజారు వద్దకు చేరుకున్నాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కంకిపాడులోని వివిధ గ్రామాలకు అవి పయనమయ్యాయి. 8 గంటల నుంచి భారీ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడంతో సాధారణ ప్రయాణీకులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణీకులు బస్సుల కోసం వేచి చూసి అవిలేక ఆటోలను ఆశ్రయించారు.

ముందస్తు అరెస్టులు



గుడివాడ : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత కూడా పోలీసులు తమ ప్రతాపం చూపుతూనే ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్ధం సభకు సీఎం జగన్ వస్తున్నారన్న కారణంతో సోమవారం ఉదయం సీపీఎం నాయకులు, టిడ్కో కాలనీ కమిటీ సభ్యులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే గృహనిర్బంధాలు చేస్తున్నట్టు పోలీసులు తెలపడంతో సీపీఎం నాయకులు బీవీ శ్రీనివాస్, టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి అరుణలు ఆక్షేపణ తెలిపారు. సీఎం గుడివాడ నుంచి వెళ్లే వరకు తమ అదుపులోనే ఉండాలని పోలీసులు ఆదేశించి వారి ఇంటి ముందు బందోబస్తును ఏర్పాటు చేశారు.

జగన్‌కు అభ్యర్థుల పాదాక్రాంతం..!

గుడివాడ : జగన్ సభలో మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌తో పాటు అసెంబ్లీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో మచిలీపట్నం, పెడన, పామర్రు అభ్యర్థులు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), ఉప్పాల రాము, కైలే అనీల్‌కుమార్‌లు జగన్‌కు పాదాభివందనం చేశారు. అవనిగడ్డ అభ్యర్థి సింహాద్రి రమేశ్ సగం వంగి నమస్కారం చేశారు. ఈ పరిణామంతో అక్కడే ఉన్న వైసీపీ శ్రేణులు అవాక్కయారు.

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులపై..

దృష్టి సారించండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వచ్చే అభ్యంతరకర, అసభ్యకరమైన పోస్టింగ్‌లపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌పై వివరాలు సేకరించారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రచార ప్రకటనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రూప్‌ల్లో వచ్చే అసభ్యకరమైన పోస్టులను వాటిని సంబంధిత నియోకవర్గాల రిటర్నింగ్ అధికారులు సైబర్‌క్రైం టీమ్‌లకు పంపాలన్నారు. సినిమా హాళ్లలో, కేబుల్ టీవీలలో, బల్క్‌ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెస్సేజ్‌ల రూపంలో రాజకీయపార్టీ నాయకులు చేయబోయే ప్రచారానికి ముందస్తుగానే ఎంసీఎంసీ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, సమాచార శాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్, ఎంసీఎంసీ కమిటీసభ్యులు పాల్గొన్నారు.



ఎంసీఎంసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కనీస సౌకర్యాలు కల్పించండి

మే 13న విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడకుండా పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. పోలింగ్ ముందురోజే మే 12వతేదీ సాయంత్రానికి అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారన్నారు. అక్కడ తాగునీరు, విద్యుత్ సౌకర్యం, భోజనవసతి, టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. 13వతేదీ ఉదయం 7గంటలనుంచే పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుబిళ్లలు, అందుబాటులో ఉంచాలని ఐసీడీఎస్ అధికారులకు కలెక్టర్ సూచించారు.


అధికారులు బాధ్యతగా ఉండాలి

పామర్రు : వచ్చేనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం నియోజకవర్గ మాస్టర్‌ట్రైనర్స్‌తో పీవో, ఏపీవోలకు జరుగుతున్న తొలివిడత శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, పీవోలు, ఏపీవోలు శిక్షణ అంశాలపై ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. మాక్ పోలింగ్‌తో పాటు ఈవీఎం, వీవీప్యాడ్ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐదుమండలాల తహసిల్దార్లు మాస్టర్‌ట్రైనీలు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీ-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 15 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ విజిల్ ద్వారా 526 ఫిర్యాదులు రాగా అన్నింటిని క్షుణంగా పరిశీలించి పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా మొత్తం 1,331 ఫిర్యాదులు రాగా 1,303 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో వున్నాయని వివరించారు. ఓటర్ హెల్ప్‌లైన్ (1950) ద్వారా 211 ఫిర్యాదులు రాగా 211 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 407 ఫిర్యాదులు రాగా 403 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా వాట్సాప్ నంబర్ (9154970454) ద్వారా 31 ఫిర్యాదులు రాగా 27 ఫిర్యాదులు, కాల్‌సెంటర్ (0866-2570051) ద్వారా 22 ఫిర్యాదులు రాగా 22 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంఎస్) ద్వారా 58 ఫిర్యాదులు రాగా 48 ఫిర్యాదులను, సీఈఓ మెయిల్స్ ద్వారా 13 ఫిర్యాదులు రాగా 9 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. 63 ప్రతికూల వార్తలకు సంబంధించి 57 అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు చే యాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలు సరళి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం కార్యకలాపాలు, వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఫిర్యాదులు-వాటి పరిష్కారం, ఎన్నికల పరిశీలకులకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అమలు, ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు తదితరాలపై చర్చించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్.నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.06 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువుల సీజ్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 15 : ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు రూ.7.06 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తుపదార్థాలు, విలువైన వస్తువులు, ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3.16 కోట్ల నగదుతో పాటు రూ.94.16 లక్షల 19,583 లీటర్ల మద్యం, రూ.12.20 లక్షల 1,84,201 గ్రాముల మత్తుపదార్థాలు, రూ.2.32 కోట్ల విలువైన 7,758 గ్రాముల విలువైన లోహాలు, రూ.6.43 లక్షల విలువైన 132 ఉచితాలను సీజ్ చేసినట్టు తెలిపారు.

బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు

» జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక, ఏప్రిల్ 15 : జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ ఉన్నతాధికారులకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, మహిళాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ అధికారులతో సోమవారం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సంస్థ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జేసీ డాక్టర్ సంపత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకొంటున్నామన్నారు. గత మూడు నెలల్లో 25 బాల్య వివాహాలు (చైల్డ్‌మ్యారేజ్) జరగకుండా నియంత్రించడం జరిగిందని, వీటిలో రెండు బాల్యవివాహాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. బాల్య వివాహ నిషేధచట్టంపై అన్నిశాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. పాఠశాలలో చదువుకొంటున్న విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నామని, డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి స్కూల్‌నందు రీజాయిన్ చేయించడం జరిగిందని జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ జి.ఉమాదేవి, లైన్ డిపార్మెంట్ జిల్లా అధికారులు, డీసీపీఓ రాజేశ్వరరావు, జాన్సన్ వున్నారు.

వేణుగోపాలస్వామి భూమి టెండర్లు రద్దు చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఈవో సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బందిని విచారించారు. ఈనెల 8న ఆయన క్షేత్రస్థాయిలో సంబంధిత భూములను కూడా పరిశీలించారు. అనంతరం దేవదాయ కమిషనర్‌కు 8 పేజీల నివేదిక సమర్పించారు. తాను స్వయంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో కలిసి విజయవాడ బందర్‌రోడ్డుకు కేవలం 400 మీటర్ల దూరంలో ఉన్న సంబంధిత 7.75 ఎకరాల భూమిని పరిశీలించినట్టు విజయరాజు తెలిపారు. అందులో లీజుదారుడు మొక్కజొన్న, అరటి పంటలను వేసి ఉన్నట్టుగా పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ భూమిని తక్కువ కాలానికి (3 సంవత్సరాలకు) లీజుకు ఇవ్వడం సరికాదని, దీనిని వాణిజ్య పరంగా 11 సంవత్సరాలకు గాను లీజుకు ఇవ్వాలని బిట్‌లు బిట్‌లుగా వీడదీసి లీజుకు ఇస్తే ఆదాయం కూడా వస్తుందని విజయరాజు తన నివేదికలో స్పష్టం చేశారు. ప్రస్తుతమిచ్చిన లీజును రద్దు చేయాల్సిందిగా కోరుతూ సిఫారసు చేశారు. ఇదే క్రమంలో మంగలిమాన్యం, జంగాల మాన్యం, అర్చక నిర్వహణ నిమిత్తం కేటాయించిన భూముల విషయంలో కూడా చర్యలు తీసుకోవాలని విజయరాజు సిఫారసు చేశారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.04	



అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్ / రూరల్, ఏప్రిల్ 15 : వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండి ఆస్తినష్టాన్ని నివారించుకోవాలని స్థానిక అగ్నిమాపకాధికారి రామ్మోహన్‌రావు ప్రజలకు వివరించారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ● ఆరుగొలను, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లలోని ప్రజలకు హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపకకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. లీడింగ్ ఫైర్‌మెన్ సంజీవ్‌కుమార్, డీఓపీ సాంబశివరావు, ఫైర్‌మెన్ మురళి, శ్యాంబాబు, కృష్ణసాగర్, నాగార్జున, దుర్గాప్రసాద్, అబ్దుల్‌హై పాల్గొన్నారు.

జగన్ బస్సుయాత్ర-ప్రయాణికుల పాట్లు

- పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద నాలుగు కిలో మీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- ట్రాఫిక్ ఆంక్షలతో అవస్థలు
- పోలీసులతీరుపై జనం ఆగ్రహం

ఉంగుటూరు, ఏప్రిల్ 15 : గన్నవరం నియోజకవర్గంలో సోమవారం జగన్ రోడ్ షో సందర్భంగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలుపుదల చేశారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఉదయం 9గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ఏలూరు నుంచి విజయవాడ వైపు వచ్చే లారీలు, ఇతర భారీ వాహనాలను పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి పక్కనున్న సర్వీస్ రోడ్డులోకి మళ్లించారు. ఇరుకుగా వుండే ఈ మార్గంలో ముందువెళ్లే వాహనాన్ని వెనుకవచ్చే వాహనం ఒకదానికొకటి ఓవర్‌టేక్ చేయడంతో గంటన్నరసేపు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో బైక్‌లు, ఆటోలను ఫుట్‌పాత్‌లపై ఎక్కించి గమ్యానికి వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.





పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన ప్రయాణికులు

ఉక్కపోతతో విలవిల

సోమవారం ఉదయం 11 గంటలకు గన్నవరం చేరుకున్న జగన్ బస్సు యాత్ర చినఅవుటపల్లి, పెదఅవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, మీదుగా తేలప్రోలుకు 12గంటలకు చేరింది. బస్సు పొట్టిపాడు టోల్‌గేట్ దాటిన వెంటనే పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి గన్నవరం నుంచి హనుమాన్ జంక్షన్‌వైపు వెళ్లే వాహనాలను నిలిపివేశారు. దీంతో పొట్టిపాడు టోల్ ప్లాజానుంచి అవుటపల్లి వరకు సుమారు 4కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆటోల్లో, కారుల్లో వున్న మహిళలు, వృద్ధులు మండే ఎండ వేడిమిని తట్టుకోలేక ఉక్కపోతతో విలవిలలాడారు. మధ్యాహ్నం ఒంటిగంట అవుతున్నా వాహనాలను అనుమతించకపోవడంతో అసహనానికి గురైన ప్రయాణికులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయడంతో టోల్‌గేట్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎండ వేడిమికి ఏ ఒక్కరి ప్రాణం పోయినా దానికి పోలీసులు బాధ్యత వహించాల్సి వుంటుందంటూ అడ్డుగా పెట్టిన బారికేడ్లను పక్కకు లాగిపడేశారు. పోలీసులు అడ్డుకోవాలని ప్రయత్నించినా ప్రజలు ఆగకపోవడంతో చేసేదేమీలేక పోలీసులు పక్కకు తప్పుకుని వాహనాలు వెళ్లేందుకు అనుమతిచ్చారు.

స్వాగతం పలకడానికి.. కూలీ జనం

హనుమాన్‌జంక్షన్ : సీఎం జగన్ సోమవారం నిర్వహించిన మేమంతా సిద్ధం యాత్రకు జనాన్ని తరలించడానికి బాపులపాడు మండలంలోని వైసీపీ నాయకత్వం తీవ్ర ప్రయాస పడింది. రెండు రోజులు ముందు నుంచే గ్రామాల్లో మహిళలను పెద్దఎత్తున తరలించ డానికి ప్రయత్నం చేశారు. రహదారి పొడుగునా గ్రామాల్లో జగన్‌కు స్వాగతం పలకడానికి ఒక్కొక్కరికి రూ.300లు బిర్యాని పొట్లాం ఇచ్చి రప్పించారు. గుడివాడ సమీపంలోని నాగవరప్పాడు వద్ద నిర్వహించిన బహిరంగ సభకు కూడా ఇదే తరహాలో మండలం నుంచి ప్రజలను తరలించారు.

టీడీపీ నాయకుడు పరిమి భాస్కర్ మృతి



భాస్కర్ పార్థివదేహంపై పార్టీ జెండాకప్పి నివాళులర్పిస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, ఏప్రిల్ 17 : టీడీపీ నాయకుడు, ఉయ్యూరు నగర పంచాయతీ 5వ వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి భర్త భాస్కర్ (50) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. రాత్రివేళ గుండెపోటు రావడంతో అతనిని స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. భాస్కర్ మృతి చెందాడన్న సమాచారం తెలుసుకున్న పార్టీ నాయకులు అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ భాస్కర్ పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. జనసేన నాయకుడు బాలశౌరి, టీడీపీ నాయకుడు బోడె ప్రసాద్, జంపాన పూర్ణచంద్రరావు, అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, పల్యాల శ్రీను, బూరెల నరేశ్, కాగిత కొండ, శివ, నరసింహారావు తదితరులు భాస్కర్‌కు నివాళులర్పించారు.



కంకిపాడులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు, ఆరుగొలనులో..

కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం

బోడె హేమ, అనుమోలు ప్రభాకరరావు పిలుపు

పెనమలూరు, ఏప్రిల్ 15 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలని బోడె సతీమణి హేమ, మునిసిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావులు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పోరంకి ఆరవ డివిజన్, యనమలకుదురులో జరిగిన శంఖారావం పాదయాత్ర కార్యక్రమాల్లో వారు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును, పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, వీరంకి కుటుంబరావు, మల్లంపాటి విజయలక్ష్మి, తమ్ము అశోక్, బెజవాడ వెంకటేష్, కందుల శివరాం, కరిమికొండ ప్రసాద్, బాబు, మల్ల వెంకటేశ్వరరావు, వీరంకి నంది, కళ్యాణం శ్రీనివాస్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఉయ్యూరు 20వ వార్డులో..

ఉయ్యూరు : చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నాయకుడు పండ్రాజు చిరంజీవి అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీ 20వ వార్డులో సోమవారం పర్యటించి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేయనున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలియజేసి సైకిల్, గాజుగ్లాసు గుర్తులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చందు, కొండపల్లి పవన్, కె శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు..



యనమలకుదురులో జరిగిన శంఖారావంలో బోడె హేమ

కంకిపాడు : వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని టీడీపీ మండల పార్టీ నాయకులు, బూత్ కమిటీ చైర్మన్ పులి శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడులోని 175 బూత్‌లో సోమవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండా నాగేశ్వరరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోగినేని వెంకట రమణ, ఏనుగ జయప్రకాష్ షేక్ బాజి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి టీడీపీతోనే

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలంటే టీడీపీతోనే సాధ్యమని టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్ తెలిపారు. ఆరుగొలను టీడీపీ, జనసేన కమిటీల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. గన్నవరం కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుమ్మల బ్రహ్మాజీ, అనిల్‌కుమార్, వీరం రాంబాబు, జనసేన నాయకులు లబ్బా శంకరం, వీరం వినయ్‌కుమార్, చొక్కాపు సత్యనారాయణ, చిన్నం మాణిక్యం, రావులపాటి భానుకుమార్, నాగు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వాన్ని సాగనంపుదాం

కూటమి అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, బోడె ప్రసాద్



పార్టీల శ్రేణులకు అభివాదం చేస్తున్న బాలశౌరి, బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 15 : అన్ని రంగాల్లో విఫలమైన సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపుదామని కూటమి అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, బోడె ప్రసాద్, బీజేపీ నేత కిలారు దిలీప్ పిలుపునిచ్చారు. యనమలకుదురు డొంకరోడ్డులో ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున జరిగిన పార్టీలోకి చేరికల కార్యక్రమంలో వారు పాల్గొని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి కనీసం ఒక్క రాజధానిని కూడా కట్టలేక జగన్‌రెడ్డి చతికిల పడ్డాడని ఎద్దేవా చేశారు. కోడి కత్తి, బాబాయిపై గొడ్డలివేటు డ్రామాలు ప్రజలు మరిచిపోక ముందే గులకరాయి డ్రామాని తెరపైకి తెచ్చి రాష్ట్ర ప్రజలను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రారంభించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాకులు కొనకళ్ల నారాయణ, వంగవీటి రాధా, కిలారు దిలీప్, వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్ర, తాతపూడి గణేష్, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, నెరుసు కృష్ణాంజనేయులు, వెలగపూడి నాగభూషణం, కమ్మిల నాగేశ్వరరావు, వెలగపూడి బాబూరావు, లంకా నారాయణరావు, కరిమికొండ సురేష్, మేకా సుబ్బారావు, కోయ ఆనంద్‌ప్రసాద్, మేకా స్వాతితేజ, గోపిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలిస్తే గన్నవరానికి ఐటీ సంస్థలు

కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి



హనుమాన్‌నగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ సతీమణి జ్ఞానేశ్వరి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 15 : టీడీపీ అధికారంలోకి వస్తే నియోజక వర్గంలో ఐటీ సంస్థలను తీసుకువచ్చి నిరుద్యో యువత ఉపాధికి బాటలు వేయడానికి కృషి చేస్తారని గన్నవరం నియోజకవర్గం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం బాపులపాడు హనుమాన్‌నగర్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి యార్లగడ్డ వెంకట్రావు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయికల్యాణి, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, గుండపనేని ఉమావర ప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, వడ్డిల్లి లక్ష్మి, గార్లపాటి రాజేశ్వరరావు,గుండేపూడి నితీష్, జనసేన నియోకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, వడ్డి నాగేశ్వరరావు, అహ్మద్, తదితరులు ఆమె వెంట ఉన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు



యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరిన ఆత్కూరు వైసీపీ నాయకులు

ఉంగుటూరు, ఏప్రిల్ 15 : జిల్లాలో సీఎం జగన్ బస్సుయాత్ర నిర్వహిస్తున్న సమయంలోనే వైసీపీకి పలువురు నాయకులు, కార్యకర్తలు ఝలక్ ఇచ్చారు. సోమవారం టీడీపీ ఆత్కూరు గ్రామపార్టీ అధ్యక్షుడు అట్లూరి రామ్‌కిరణ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఆర్.తిరుపతి, హెచ్.వాసు, పి.గడ్డియ్య, పి.యశ్వంత్, జి.దుర్గాప్రసాద్ బి.తేజ, షేక్ పతీష్, ఎం.నాగసాయి, జె.జీవన్‌బాబు, ఎస్కే రంగ, జి.వినయ్‌కుమార్ డి.గౌరినాయుడు, మూల్పూరి నాని, మల్లాది సుధీర్ తదితర 50మంది వైసీపీ నాయకులు గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి యార్లగడ్డ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దారం విజయ్, తమ్మిరెడ్డి సాంబశివరావు, కలపాల ఆశీర్వాదం, లంకా వీరభద్రరావు, అట్లూరి మోహన్‌బాబు, షేక్ బాజీ, భూషణం తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డకు మద్దతుగా నిలుస్తాం : ఎమ్మార్పీఎస్

గుణదల, ఏప్రిల్ 15 : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సూచన మేరకు గన్నవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు తమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లుగా నియోజకవర్గ నాయకులు తెలిపారు. సోమవారం నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి మద్దతు తెలిపారు. యార్లగడ్డను కలిసిన వారిలో నిడమర్తి బుజ్జరావు, మంద వేణుబాబు, చోడవరపు వెంకటేశ్వరరావు, సిర్రా అశోక్‌కుమార్, చేదుర్తిపాటి రమేష్ బాబు, పులపాక కుమార్, వంగూరి మరియదాసు, నందేటి తిరుపతిరావు, కోట బాబూరావు, రెడ్డి గోపాలరావు తదితరులు ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రక్షణ కరువు



కానుమోలులో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బచ్చుల బోస్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 15 : టీడీపీ హయంలో ప్రవేశపెట్టిన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను తగ్గించడంతోపాటే ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి కక్షపూరితంగా వ్యవహరిస్తున్న వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కానుమోలు టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన జయహో బీసీ (బీసీల ఆత్మీయసమ్మేళనం)లో ఆయన పాల్గొన్నారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీలు అనుభవిస్తున్న 34శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన ఘనత వైసీపీదేనని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలోని రాగానే ఎన్డీఏ కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలకు బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందన్నారు. గన్నవరంలో జనసేన, బీజేపీ బలపరచిన టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెడుగొండి శివశంకర్, దయాల రాజేశ్వ రరావు, వేగిరెడ్డి పాపారావు, రాజులపాటి నాగరాజు, చింతల వేంకటశివ అప్పారావు, మజ్జిగ నాగరాజు, చిన్నం శ్రీదేవి, నక్కా నాగరాజు, రొంటే శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

ఉయ్యూరు, ఏప్రిల్ 15 : జగన్ అవినీతి, అసమర్థ, పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలసి సోమవారం చినఓగిరాలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేకప్‌స్టార్ జోగి రమేశ్ పెడన నియోజకవర్గంలో దోచుకున్న సొమ్మంతా పెనమలూరు నియోజక వర్గ ప్రజలు కక్కించి పేకప్ చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు యెనిగళ్ల కుటుంబరావు, వి సత్యనారాయణ, యెనిగళ్ల శిరీష, కాకాని శ్రీనివాసరావు, చెరుకూరి ప్రసాద్, యార్లగడ్డ సాయి, సంగెపు రంగారావు, గోపీచంద్, జనసేన నాయకులు ముప్పారాజు, కార్తికేయ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.04

బెడిసికొట్టిన వైసీపీ గులకరాయి డ్రామా: కాగిత కృష్ణప్రసాద్

పెడన, ఏప్రిల్ 15: వైసీపీ ఆడిన గులకరాయి డ్రామా బెడిసికొట్టిందని టీడీపీ-జనసేన-బీజేపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విలేకరులకు తెలిపారు. వైసీపీ పాలకుల డ్రామాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం చేస్తుంటే పథకం ప్రకారం విద్యుత్ సరఫరా నిలిపివేసి వాళ్లలో వాళ్లే రాయితో కొట్టుకు న్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో సానుభూతి కోసం వైసీపీ హత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన ఆం దోళన వ్యక్తం చేశారు. బుధవారం పెడన పట్టణంలో నిర్వ హించనున్న ప్రజాగళం బహిరంగ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని ఆయన పిలు పునిచ్చారు.

మచిలీపట్నాన్ని

పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతాం

● కొల్లు రవీంద్ర హామీ



జ్యుయలరీ పార్కులో కార్మికులతో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: అమరావతి రాజధానికి దగ్గరగా ఉన్న మచిలీపట్నం నగరాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతామని, బందరు పోర్టును అభివృద్ధి చేస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పొట్లపాలెం, పోతేపల్లి గ్రామాలు, జ్యుయలరీ పార్కులో కొల్లు రవీంద్ర పర్యటించారు. పోతేపల్లిలో ఆటో వర్కర్ల పార్కు, జ్యుయలరీ పార్కును ఎన్టీ రామారావు నెలకొల్పారన్నారు. రోల్డుగోల్డు పరిశ్రమకు అంతర్జాతీయ మార్కెటింగ్ పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల 17న చంద్రబాబు మచిలీపట్నం వచ్చినప్పుడు నగర సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. జ్యుయలరీ పార్కులో కార్మికులకు ఆదాయపు వనరులు పెంచేందుకు చిరంజీవి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో రూ.2.5 కోట్ల నిధులు తెచ్చి రోల్డుగోల్డు నగల తయారీలో మెళకువలపై శిక్షణ ఇప్పించేందుకు భవనాలు నిర్మించామన్నారు. జనసేన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ బందరు రూరల్ మండలం అధ్యక్షుడు కుంచే నాని, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు తలారి సోమశేఖర్, కాటం మధు, కమ్మిల మధు, అక్కుమహంతి రాజా, శివ పాల్గొన్నారు.





సంగమేశ్వరంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మండలి విజయలక్ష్మి, ప్రజాగళం సభకు రావాలంటూ గొడుగుపేటలో ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ప్రజాగళానికి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు, గొర్రెపాటి గోపీచంద్

గ్లాస్ గుర్తుకు ఓటేయండి: మండలి విజయలక్ష్మి

నాగాయలంక: కూటమి అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరికి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి ప్రజలను కోరారు. సోమవారం సంగమేశ్వరంలో ఇంటింటికి తిరిగి ఆమె ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, విశ్వనాథపల్లి లక్ష్మి, బండే కనకదుర్గ, మాదివాడ అర్జునరావు, కొక్కిలిగడ్డ నాగరాజు, విశ్వనాథపల్లి పాప, ఉప్పల ప్రసాద్, ముమ్మానేడ్డి రాజశేఖర్, బండ్రెడ్డి మల్లికార్జునరావు, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్లమన్నాడులో కూటమి నాయకుల ప్రచారం

గుడ్లవల్లేరు: కూటమి తరపున పోటీచేసే అభ్యర్థుల గుర్తులను ఓటర్లకు అవగాహన పరిచే కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. సోమవారం వడ్లమ న్నాడులో తమ పార్టీ ఎన్నికల గుర్తుల కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహనపరిచారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ ఏడుకొండలు, పెన్నేరు రమేష్, తోట చిన్నారి, మాదాసు శ్రీనివాస్, శేషవేణి పాల్గొన్నారు.

ప్రజాగళానికి తరలిరండి

● ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి తెలుగు మహిళల పిలుపు

మచిలీపట్నం టౌన్: కోనేరుసెంటర్‌లో ఈనెల 17న సాయంత్రం నిర్వహిస్తున్న ప్రజాగళం సభకు చంద్రబాబుకు, పవన్‌కల్యాణ్ విచ్చేస్తున్నారని, మహిళలు తమ సమస్యలు చెప్పుకొనేందుకు తరలిరావాలని గొడుగుపేటలో మహిళలకు సోమవారం తెలుగుమహిళలు బొట్టుపెట్టి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, నాయకులు కట్టా అంజిబాబు, దుర్గల ఆధ్వర్యంలో ఇంటింటికీ పర్యటించి కుంకుమ బొట్టు పెట్టి ఆహ్వానించారు. ఈడేపల్లిలో తెలుగు మహిళలు ఇంటింటికీ పర్యటించి మహిళలకు బొట్టుపెట్టి ప్రజాగళం సభకు తరలిరావాలని ఆహ్వానించారు. పి.విమలాగాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్, పామర్తి నరేష్, పామర్తి రాధిక, గంజాల రవికుమార్, కొనకళ్ల భాను, నల్లబాబు, జి.కృష్ణమూర్తి తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు.

రేపు పెడనకు తరలిరండి

బంటుమిల్లి: పెడన బస్టాండ్‌లో ఈనెల 17న బుధవారం సాయంత్రం 3 గంటలకు జరిగే ప్రజాగళం కార్యాక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. చంద్రబాబు పవన్ కల్యాణ్, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి, కొనకళ్ల నారాయణ, బూరగడ్డ వేదవ్యాస్, బీజేపీ నేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

చంద్రబాబుకు రైతు సమస్యలు వివరిద్దాం: గోపు



కానూరులో ప్రజాగళం ఆహ్వాన పత్రికలను పంచుతున్న గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్: ప్రజాగళం సభకు మచిలీపట్నం వస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిద్దామని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ రైతులకు తెలిపారు. బందరు మండలం కానూరు, పెదపట్నం, తాళ్లపాలెం, గోకవరం, సిరివెళ్లపాలెం, మంగిన పూడి, తపసిపూడి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, ప్రజాగళం ఆహ్వానపత్రికలను పంచారు.



రాపర్లలో బాలశౌరి, కుమార్‌రాజాకు హారతి పడుతున్న మహిళలు

మరింత సేవ చేసే అవకాశం కల్పించండి

● ఎన్నికల ప్రచారంలో వల్లభనేని బాలశౌరి

పామర్రు, ఏప్రిల్ 15: కృష్ణాజిల్లాను అభివృద్ధి చేయడానికి, ప్రజలకు మరింత సేవచేయడానికి అవకాశం కల్పించాలని టీడీపీ-జనసేన-బీజేపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ప్రజలను కోరారు. మండల పరిధిలోని రాపర్ల, జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉండ్రపూడి గ్రామాల్లో సోమవారం కూటమి పామర్రు నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి వర్ల కుమార్‌రాజాతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని వైసీపీ చేసిందని, ప్రకృతి సంపదను ఇష్టారాజ్యంగా దోచుకుంటూ, ప్రశ్నించేవారిపై దాడులు కేసులతో భయభ్రాంతులు సృష్టించి అరాచకపాలన చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి బుద్ధిచెప్పాలని ఆయన కోరారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బాలశౌరిని గెలిపించాలని వర్ల కుమార్‌రాజా కోరారు. రాపర్ల ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులను టీడీపీలోకి చేర్చుకుంటున్న వెనిగండ్ల రాము

గుడివాడలో వైసీపీకి షాక్‌లపై షాక్‌లు

● టీడీపీలో చేరిన వైసీపీ సీనియర్ నాయకులు రాంబాబు, కృష్ణ

గుడివాడ: గుడివాడ నియోజకవర్గంలో వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. పట్టణంలోని 34వ వార్డుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు ముడిలి రాంబాబు, మాతంగి కృష్ణలతో పాటు మరిన్ని కుటుంబాలు సోమవారం టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి రాము పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత 34వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విజయదుర్గ అమ్మవారి దేవ స్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, లింగం ప్రసాద్, బోరాడ మధుసూదనరావు, గంటా అజయ్, శివకృష్ణ, బొడ్డు లక్ష్మి, కళావతి, మధుబాబు, సునీల్, రంభ, చక్రపాణి, అమ్ముల సురేంద్ర, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ సిద్ధం సభకు

అవనిగడ్డ నుంచి 31 ఆర్టీసీ బస్సులు

● బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 15: గుడివాడలో సోమవారం నిర్వహించిన మేము సిద్ధం సభకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి 31 బస్సులు పంపడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. అవనిగడ్డ డిపో నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు సభకు పంపటంతో ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

బస్సు యాత్రకు స్పందన లేకే

జగన్‌రెడ్డి డ్రామాలు: దేవరపల్లి అనిత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: బస్సు యాత్రకు స్పందన లేకపోవడం వల్లనే జగన్‌రెడ్డి గులకరాళ్ల దాడి డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ కార్పొరేటర్, తెలుగు మహిళ మచిలీపట్నం అధ్యక్షురాలు దేవరపల్లి అనిత అన్నారు. టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో ఎన్నికల ముందు కోడికత్తి, బాబాయ్ హత్య పేరుతో డ్రామాలు ఆడిన జగన్‌రెడ్డి తాజాగా గులకరాళ్ల దాడి డ్రామా ఆడుతున్నారన్నారు. మద్దాల లక్ష్మీనాంచారమ్మ, ఎన్.వసంతకుమారి, మావుళ్లమ్మ పాల్గొన్నారు.

అనుచరులతో వేదవ్యాస్

ఆత్మీయ సమావేశం నేడు

పెడన, ఏప్రిల్ 15: టీడీపీ పెడన టికెట్‌ను ఆశించి భంగపడ్డ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ మంగళవారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని తోటమూల ఫంక్షన్ హాలులో తన అనుచరులు, అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. తన అభిమానులందరినీ కలుసుకోవాలన్న ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తన అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

నేడు అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం

అవనిగడ్డ, ఏప్రిల్ 15: అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం మంగళవారం సాయంత్రం అవనిగడ్డలోని విద్యా విహార్ పాఠశాలలో జరుగుతుందని సంఘ నేతలు నాగిడి సాంబశివరావు, వల్లభనేని మణికంఠ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పాల్గొంటారని, సంఘ పెద్దలు, సంఘీయులు హాజరుకావాలని సోమవారం అవనిగడ్డ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోరారు.

లంకమ్మ హుండీల

ఆదాయం రూ.3,13,812

అవనిగడ్డ, ఏప్రిల్ 15: లంకమ్మ ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. 72 రోజులకు రూ.3,13,812 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. మచిలీపట్నం దేవాలయాల తనిఖీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుండీలు లెక్కించగా, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి



సివిల్ సప్లయిస్ డీఎం సతీష్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

చల్లపల్లి, ఏప్రిల్ 15: ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నేతల బృందం మచిలీపట్నంలోని సివిల్ సప్లయిస్ డీఎం సతీష్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిలుపుదల చేశారని, కానీ, అనేక మంది రైతులు నూర్పిళ్లు చేశారని, ధాన్యం కల్లాల్లో ఉందని డీఎం దృష్టికి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెచ్చారు. మిల్లర్లకు అమ్ముతుంటే తక్కువ ధరకు కొంటున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విన్నవించారు. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో అనేక మంది రైతులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారని, చల్లపల్లి మండలంలో మూడువేల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో ఉందని వివరించారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని సివిల్ సప్లయిస్ డీఎం హామీ ఇచ్చారని రైతు నాయకులు తెలిపారు. హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నార్ల వెంకటేశ్వరరావు, అడ్డాడ ప్రసాద్‌బాబు ఉన్నారు.

ఇండియా కూటమి

అభ్యర్థులను బలపరచండి: కేవీవీ ప్రసాద్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: దేశంలో లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేసేందుకు ఇండియా కూటమిని గెలిపించుకోవాలని, గన్నవరంలో సీపీఎం అభ్యర్థిని గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, తాడేపల్లి తాతయ్య, అడ్డాడ ప్రసాద్, మోదుమూడి రామారావు, మున్నంగి నరసింహారావు, పి.ఉమాకాంతం, సీహెచ్ శ్రీనివాసరావు, జి.ప్రకాష్, హనుమోలు సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

పమిడిముక్కల, ఏప్రిల్ 15: పామర్రు నుంచి ఐనంపూడి వరకు ఉన్న హెవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతుల కారణంగా ఐనంపూడి, ముళ్లపూడి గ్రామాల పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు

జీతాల బకాయిలు చెల్లించాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించాలని, పండుగ బోనస్ ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు సోమవారం సీఐటీయూ నాయకుడు బి.సుబ్రహ్మణ్యం తదితరులు వినతిపత్రం సమర్పించారు. మచిలీపట్నం కార్పొరేషన్‌లో 512 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి మార్చి నుంచి కొత్త జీతాలు చెల్లించాల్సి ఉన్నా, ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. 1వ తేదీన చెల్లించాల్సిన జీతాలు నేటికీ చెల్లించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పండుగ బోనస్ రూ.1000 చెల్లించాలని, మార్చి నుంచి కార్మికుల జీతాలు రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. మృతిచెందిన కార్మికులు 15 మంది ఉన్నారని, వారికి ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.నాగమల్లేశ్వరరావు, సీహెచ్ బుల్లెమ్మ, ఎస్. కోటేశ్వరరావు, వై.విజయ, సంతోష్‌రావు, బి.సుబ్బారావు, వై.దుర్గాప్రసన్న, శ్రీనివాసరావు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 15: తోట్లవల్లూరు బందరు కాలువ వంతెన వద్ద ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థి ఆకునూరు ప్రవీణ్(25) దుర్మరణం చెందాడు. తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ తల్లిదండ్రులు గంగాధర్, మరియమ్మ కంకిపాడు మండలం కాసరనేనివారిపాలెంలో స్థిరపడ్డారు. ఆదివారం తోట్లవల్లూరులో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రవీణ్ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని రాత్రి 12 గంటల సమయంలో బైక్‌పై ఉయ్యూరు వెళుతూ వంతెన వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఎడ్లబండి లేదా ట్రాక్టర్‌ను గాని ఢీకొట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ప్రవీణ్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కూచిపూడి, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవల్లో భాగంగా రెండో రోజు సోమవారం మొవ్వ అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి..కేసు నమోదు

నాగాయలంక, ఏప్రిల్ 15: నంగేగడ్డ గ్రామానికి చెందిన బండ్రెడ్డి అనిల్ కుమార్ వద్ద చోడవరం గ్రామానికి చెందిన దళిత యువకుడు దాసరి కిరణ్ పనికి వస్తానని డబ్బులు తీసుకుని రాకుండా వేరే వారి వద్దకు వెళ్తుంటే అనిల్ కోపంతో వెళ్లి కిరణ్‌ను కొట్టగా, అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ టి.ప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి డబ్బులు విషయాన్ని బయట వ్యక్తులకు ఎందుకు చెబుతున్నారని అనిల్‌ను కిరణ్ అడుగగా, ఎవరికీ చెప్పలేదని అనిల్ అన్నారు. గోపి అనే వ్యక్తికి చెప్పావు కదా అని అడిగాడు. ఇద్దరూ కలసి గోపి వద్దకు వెళ్లి మాట్లాడుతుండగా, మాటల మధ్యలో గొడవ జరిగింది. ఆగ్రహంతో కిరణ్‌ను దగ్గర ఉన్న తాటిమట్టతో అనిల్ కొట్టడంతో గాయమవడంతో కిరణ్ అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొని బోదెలోకి

బోల్తా కొట్టిన ఎక్సైజ్ వాహనం

కోడూరు, ఏప్రిల్ 15: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై కొత్తపాలెం-మాచవరం గ్రామాల మధ్య గ్యాస్ సిలిండర్ల ఆటోను ఎక్సైజ్ వాహనం వెనుక వైపున ఢీకొని టైరు పగలడంతో మురుగు బోదెలోకి పల్టీ కొట్టింది. సోమవారం అవనిగడ్డ నుంచి కోడూరుకు గ్యాస్ సిలిండర్ల ఆటో వస్తుండగా.. కోడూరు నుంచి అవనిగడ్డ వెళ్తున్న ఎక్సైజ్ వాహనం వెనుక వైపున ఢీకొని టైరు పగిలి పక్కనే ఉన్న మురుగు బోదెలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్సైజ్ అధికారులకు, ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా ప్రాంతాన్ని కోడూరు ఇన్‌చార్జ్ ఎస్సై జి.రమేష్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

● అవనిగడ్డ మండల సమన్వయ కమిటీ సమావేశం తీర్మానం

అవనిగడ్డ, ఏప్రిల్ 15: అవనిగడ్డ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు తీర్మానించారు. అవనిగడ్డలో సోమవారం మూడు పార్టీల సమన్వయకమిటీ సమావేశం మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో నిర్వహించారు. ఈసారి జరిగే ఎన్నికలు రాష్ట్ర ప్రగతికి, అభివృద్ధికి ఆయువు పట్టులాంటివని, వైసీపీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని, ఆ పార్టీని ఓడించేందుకు మూడు పార్టీలు ఏకమై కూటమి అభ్యర్థులుగా తనను నిలిపాయని బుద్ధప్రసాద్ తెలిపారు. మూడు పార్టీల నేతలు ఆయా పార్టీల కార్యకర్తలను సమన్వయ పర్చుకోవాలని బుద్ధప్రసాద్ సూచించగా, మూడు పార్టీల నేతలు దీనికి అంగీకారం తెలిపారు. మండలి వెంకట్రామ్, యాసం చిట్టి బాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, రాయపూడి వేణు గోపాలరావు, రాజనాల వీరబాబు, సుబ్రహ్మణ్యం, వెంకటగిరి పాల్గొన్నారు.

వైభవంగా గో-వృషభ కల్యాణం

నాగాయలంక, ఏప్రిల్ 15: తలగడదీవి గ్రామంలో భోగాది వెంకట బసవరావు- హేమవల్లి దంపతుల గృహంలో సోమవారం సంప్రదాయ పద్ధతిలో గో-వృషభ కల్యాణాన్ని రేపల్లెకి చెందిన వేదపండితుడు డి.హరిబాబు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో వధూవరులుగా అలంకరించి బాసికాలు కట్టి, తాళిని కట్టి మంగళ వాయిద్యాలతో హిందూ ఆచారంలో కల్యాణాన్ని జరిపించారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్-విజయలక్ష్మి దంపతులు పూజలు చేశారు.

200 మంది కేయూ విద్యార్థులకు ఉద్యోగాలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 200 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చైతన్య, భాష్యం విద్యా సంస్థలకు 100 మంది, అశోక్ లేలండ్, టాటా వెస్ట్రన్ కంపెనీ నుంచి మరో 100 మంది ఎంపికవడంపై కేయూ వీసీ జ్ఞానమణి హర్షం వ్యక్తం చేశారు. అంజనాస్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ ఎంపికల్లో అశోక్ లేలండ్ హెచ్‌ఆర్ విభాగం డిప్యూటీ మేనేజర్ ఎస్. శంకర్, ట్రైనీ ఎస్. సుస్మిత, టాటా వెస్ట్రన్ ప్రతినిధులు నవీన్, భవానీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హెచ్‌ఓడీ సుందరకృష్ణ, కిషోర్, అలీమీర్జా పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చింతగుంటపాలెంలో సంస్థ చైర్మన్ ఉల్లి రంగారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు విశ్రాంత బాల భవన్ డైరెక్టర్ ఎం.వి.బి.జి. తిలక్ ఆర్థిక సాయాన్ని అందించారు. బీటెక్ విద్యార్థి సమ్మెట వసంతికి రూ.25 వేలు, హనీష్‌వర్ధన్‌కు రూ.10, చలివేంద్రం నిర్వహణకు రూ.5వేల విరాళం అందచేశారు. మానవత అధ్యక్షుడు పి.సాయికృష్ణ, విశ్రాంత ఎంఈవో కారుమూరి రాజేంద్రప్రసాద్, డి.సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

సీతారామస్వామి తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 15: మోటూరు(గోదాపురం) సీతారామస్వామి దేవస్థానంలో సీతారామస్వామి తిరు కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం నుంచి ఉత్సవాలు ప్రారంభించారు. సోమవారం ధ్వజారోహణం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ గర్వణం, రక్షా బంధనం నిర్వహించారు. 16న పెండ్లి కుమారుడి ఉత్సవం, నిత్యహోమం, గ్రామ బలిహరణ, తిరువీధుల్లో ధ్వజారోహణం, ఎదుర్కోల సన్నాహం, 17న ఆలయ వంశస్థులు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల తిరుమల చార్యులు అయ్యంగార్, శ్రీమాన్ రంగం తిరువెంగళ మాధవన్ అయ్యంగార్, శ్రీ చక్రవర్తుల వివేక్ అయ్యంగార్ ఆధ్వర్యంలో సీతారామస్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించనున్నారు. రాత్రి గరుడ వాహనం, గ్రామోత్సవం నిర్వహిస్తారు. 18న పొన్న వాహనోత్సవం, 19న రథోత్సవం, 20న వసంతోత్సవం, కొట్నాల వసంతోత్సవం నిర్వహిస్తారు. 21న పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి

భద్రాద్రి రామాలయంలో కల్యాణోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15: రుస్తుంబాదలోని భద్రాద్రి రామాలయంలో సోమవారం కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ చేశారు. భేరీతాండవం కార్యక్రమం నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన కె.కుమారాచార్యులు యాజ్ఞీకం నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో వై.శిరీష ఆధ్వర్యంలో బందరుకోట కోదండ రామస్వామి ఆలయంలో అంకురారోపణ, వాస్తుపూజ కార్యక్రమాలు నిర్వహించారు.